RNI. No. TELTEL /2022/ 89348



మన వార్తలు.. మన సమాచారం.. మన విశేషాల మాగాణ.. మన..

# తెలంగాణ అవతరణ

ఆత్మ గౌరవ అక్షర సాక్ష్యం

తె లు గు దిన ప త్రి క

సంపుటి : 4 సంచిక : 130 | పెద్దపల్లి | ఎడిటర్ : పి. రామకృష్ణ | శనివారం, మే.9, 2026 | పేజీలు : 8 | వెల : రూ. 5/-

## చైనాలో ఇద్దరు మాజీ రక్షణ మంత్రులకు మరణశిక్ష

బీజింగ్:చైనా రక్షణ మంత్రులుగా చేసిన ఇద్దరికీ భారీ శిక్ష వేసింది కోర్టు. గతంలో రక్షణ మంత్రులుగా చేసిన వి ఫెంగీ, లీ షాంగ్‌పు.. మరణ శిక్ష విధించింది. అయితే రెండేళ్ల సమయంలో ఎటువంటి అపరాధానికి పాల్పడకుంటే, వారికి జీవితకాల శిక్ష వర్తించనున్నది. అవినీతి కేసులో మిలిటరీ కోర్టు ఈ శిక్షను ఖరారు చేసింది. ఇద్దరు మంత్రులు గతంలో లంచాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. లీ షాంగ్‌పూ లంచాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ 2014 నుంచి అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. సీనియర్ మిలిటరీ,పొలిటికల్ అఫీషియల్స్‌ను ఆయన టార్గెట్ చేస్తున్నారు. ఆ ఆపరేషన్‌లో భాగంగా అనేక మంది హై ర్యాంక్ ఆఫీసర్లు, మిలిటరీ నేతల్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈ ఏడాది జనవరిలో చైనా మిలిటరీ నాయకత్వంలో భారీ మార్పులు జరిగాయి. గతంలో 11 మంది సభ్యులతో శక్తివంతంగా ఉన్న సెంట్రల్ మిలిటరీ కమీషన్‌లో ఇప్పుడు సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది. అవినీతి వ్యతిరేక ప్రచారంతో జిన్‌పింగ్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. అయితే దేశాధ్యక్షుడు జిన్‌పింగ్‌తో లీ షాంగ్‌పూ , వి ఫెంగీ మధ్య ఏవైనా బేధాలు ఉన్నాయో లేదో తెలియదు.



## ప్రజల భాగస్వామ్యంతోనే మూసీ అభివృద్ధి..

హైదరాబాద్,మే 8: ప్రజా భవన్‌లో మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టుపై కేబినెట్ సబ్ కమిటీ శుక్రవారం సమావేశమైంది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టును ప్రజల భాగస్వామ్యంతోనే అమలు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి పేరుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండాచూడాలని, ప్రజల ఆస్తులకు నష్టం లేకుండా ప్రాజెక్టును రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈమేరకు అలైన్‌మెంట్ మార్పులు చేసి నిర్మాణాలపై ప్రభావం తగ్గించేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. మూసీ నది పునరుజ్జీవనం ప్రాజెక్టును మొత్తం55 కిలోమీటర్ల మేర 5దశల్లో అభివృద్ధి చేపట్టనున్నారు. ఫేజ్-1కు7,055 కోట్ల రూపాయల వ్యయం అంచనా వేశారు.

ఆర్థిక చర్చలు పూర్తి అయ్యాయి. హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు, ఉస్మాన్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులను కేబినెట్ సబ్ కమిటీ ఆదేశించింది.

## కొడంగల్ భూములు కృష్ణానదీ జలాలతో తడవాలి

### కొడంగల్‌లో అభివృద్ధి పనులకు సీయం రేవంత్ శ్రీకారం

కొడంగల్:కొడంగల్ మెట్ట భూములు కృష్ణా నదీ జలాలతో తడవాలన్నదే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ కొడంగల్ పర్యటనలో భాగంగా ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం సుమారు రూ.110 కోట్లతో నిర్మించనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం గర్వించేలా, పేదల తిరుపతిగా కొడంగల్ శ్రీవారి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. గతంలో కొడంగల్ నియోజకవర్గానికి ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని అన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఇతరులను యాచించాల్సిన పరిస్థితి ఉండేదని తెలిపారు. కానీ ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న నాకు ముఖ్యమంత్రి పదవి దక్కిందని కామెంట్ చేశారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ఇక్కడ వస్తున్న



మార్పులను ప్రజలు గమనించాలి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## ప్రాణహిత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

**హైదరాబాద్,మే 08:**మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామం వద్ద ప్రతిపాదిత ప్రాణహిత బ్యారేజ్ నిర్మాణ స్థలాన్ని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు,వివేక్ వెంకటస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు ఎత్తు, కాల్వల సామర్థ్యం తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులను అడిగివివరాలు తెలుసుకున్నారు. అనంతరం తుమ్మిడిహెట్టి పుష్కర ఘాట్ వద్దఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్కు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి లేఖ రాశారనితెలిపారు. వచ్చే వారం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అయి బ్యారేజ్ ఎత్తుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మళ్లించి తెలం గాణకు అన్యాయం చేసిందని మంత్రులు ఆరోపించారు. తుమ్మిడి హెట్టి వద్ద 150నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణం అవసర మని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.



మహారాష్ట్ర అనుమతితోనే పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం సాధ్య మవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయిహరీష్ బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, బెల్లంపల్లి ఎమ్మెల్యే జి.వినోద్,కలెక్టర్ హరిత, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే

## మేం రాజీనామా చేస్తాం..

### - టీవీకే విజయ్ హెచ్చరిక

చెన్నై, మే 8:తమిళనాడు రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. ప్రభుత్వ ఏర్పాటులో సందిగ్ధత కొనసాగుతోంది. టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని విజయ్ భావిస్తున్నప్పటికీ, ఇతర పార్టీల నుంచి సరైన మద్దతు లభించడం లేదు. మిగతా పార్టీల్లో కొన్ని డీఎంకేతో, ఇంకొన్ని ఏఐఏడీఎంతో పొత్తులో ఉన్నాయి. ఇప్పుడు టీవీకేతో కలవాలంటే ఈ పొత్తులు వదులుకోవాలి.

అలా కూటమి నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధపడ్డా.. ఇతర సమస్యలున్నాయి. అందువల్ల ఏ పార్టీ కూడా విజయ్‌కు పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వలేకపోతోంది. ఇదే సమయంలో తమిళనాడులో సరికొత్త కూటమి ఏర్పాటుపై ప్రచారం జరుగుతోంది. బద్ధ శత్రువులైన డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చిస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అంశంపై విజయ్ కూడా స్పందించాడు.

ఒకవేళ డీఎంకే, ఏఐఏడీఎంకే కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే తన టీవీకే తరఫున ఎన్నికైన 107 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారని ఆయన హెచ్చరించారు. విజయ్ టీవీకే ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాటుపై ముందుగా డీఎంకే, ఏఐఏడీఎంకే సానుకూలంగానే స్పందించాయి.



కానీ, విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకాకపోవడంతో డీఎంకే, ఏఐఏడీఎంకే చేతులు కలిపేందుకు ప్రయత్నిస్తున్నాయి. అయితే, ఏఐఏడీఎంకేతో పొత్తు అంటూ జరుగుతున్న ప్రచారాన్ని డీఎంకే ఖండించింది.

ఆ పార్టీఅధికార ప్రతినిధి టీకేఎస్ ఎలంగోవన్ మాట్లాడుతూ ఈ ప్రచారంలో నిజం లేదన్నాడు. ఈ విషయంలో తనకు ఎలాంటి సమాచారం లేదని తెలిపాడు. గవర్నర్ విజయ్ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఈ నెల 10 వరకు గడువు ఇచ్చాడని, ఆ లోపు అతడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకపోతే ఏఐఏడీఎంకేతో పొత్తు అంశాన్ని పరిశీలిస్తామని ఎలంగోవన్ తెలిపారు. అయితే, డీఎంకే, ఏఐఏడీఎంకే పొత్తు అంశాన్ని కాంగ్రెస్ ఖండించింది.

## ఇండియా కూటమికి డీఎంకే గుడ్ బై..

## అధికారికంగా స్పీకర్‌కు లేఖ

చెన్నై, మే 8:తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత మారిన రాజకీయ సమీకరణాలు ప్రతిపక్ష ఇండియా కూటమిలో ప్రకంపనలు సృష్టిస్తోంది. తమిళనాడులో టీవీకేకు మద్దతు తెలపడంపై కాంగ్రెస్ పై గుర్రుగా ఉన్న డీఎంకే షాకింగ్ నిర్ణయం తీసుకుంది. డీఎంకే, కాంగ్రెస్ పార్టీల మధ్య దశాబ్దాల కాలం నాటి పొత్తుకు అధికారికంగా ముగింపు పలికింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలని డీఎంకే ఎంపీ కనిమొళి స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా, కాంగ్రెస్‌తో తమ పొత్తు ముగిసిందని అందువల్ల ఇప్పటి వరకు పార్లమెంటులో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కూర్చుంటున్న డీఎంకే సభ్యులు ఇకపై వారి పక్కన కూర్చోవడం సముచితం కాదని లేఖలో పేర్కొన్నారు.

డీఎంకే పార్లమెంటరీ పార్టీ సభ్యులకు విడిగా సీట్లు కేటాయించాలని, తద్వారా సభలో తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలు కల్పించాలని ఆమె స్పీకర్‌ను కోరారు. కాంగ్రెస్, డీఎంకే మధ్య



బంధం ముగిసిపోవడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీశాయి. మయిలడుతురై లో కాంగ్రెస్ మద్దతుదారులపై డీఎంకే మద్దతుదారులు భౌతిక దాడులకు పాల్పడ్డారు. నిన్నా మొన్నటి వరకు స్నేహగీతం ఆలపించిన ఇరు పార్టీల నేతలు ఒక్కసారిగా ఇలా భౌదితక దాడులకు దిగడంతో అక్కడ సిట్యుయేషన్ సీరియస్ గా మారింది.

## పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా మళ్లీ రంగస్వామి

### ఐదోసారి సీఎంగా రికార్డు

**న్యూఢిల్లీ,మే 08:** కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి ముఖ్యమంత్రిగా ఎన్.రంగస్వామి తిరిగి ఎన్నికయ్యారు. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించడంతో, కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలందరూ ఆయనను తమ శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఆయన ఐదవసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి సరికొత్త రికార్డు సృష్టించబోతున్నారు. మొత్తం 30 స్థానాలున్న పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 16. అయితే ఏప్రిల్ 9న జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఏకంగా 18 స్థానాలను కైవసం చేసుకుని స్పష్టమైన మెజారిటీని సాధించింది. ఏఐఎన్ఆర్సీ: పోటీ చేసిన 16స్థానాల్లో 12చోట్ల ఘన విజయం సాధించి అతిపెద్ద పార్టీగా నిలిచింది. బీజేపీ: 10 స్థానాల్లో పోటీ చేసి 4 స్థానాలను గెలుచుకుంది. ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు కూడా కూటమికి మద్దతు తెలుపుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష ఇండియా కూటమి కేవలం 6 స్థానాలకే పరిమితమైంది.

ఇందులోడీఎంకే 5 స్థానాలను గెలుచుకోగా, కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక్క స్థానంతో సరిపెట్టు కోవాల్సి వచ్చింది. పుదుచ్చేరి రాజకీయాల్లో



అత్యంతసామాన్యుడిగా, మృదుభాషిగాపేరున్న ఎన్.రంగస్వామికి ప్రజలు మరోసారి బ్రహ్మరథం పట్టారు. గతంలో నాలుగు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న ఆయన, ఇప్పుడు ఐదోసారి పగ్గాలు చేపట్టనున్నారు. ఏఐఎన్ఆర్సీ-బీజేపీ కూటమిలో సమన్వయం సాధిస్తూ రాష్ట్రాన్నిఅభివృద్ధి పథంలో నడిపిస్తారన్న నమ్మకంతో ఎమ్మెల్యేలు ఆయన వైపు మొగ్గు చూపారు. త్వరలోనే ఆయన లెఫ్టినెంట్ గవర్న ర్‌ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు హక్కును కోరనున్నారు. దాంతో పు దుచ్చేరిలో ఎన్డీయే సర్కార్ కొలువుదీరడం ఖాయమైంది.

## తమిళనాడులో విజయ్‌కు లైన్ క్లియర్..

## సంఖ్యా బలం రెడీ..!

### టీవీకే : 107- కాంగ్రెస్ : 5- సీపీఐ : 2- సీపీఎం : 2- వీసీకే : 2

చెన్నై: తమిళనాడులో టీవీకే ప్రభుత్వం ఏర్పాటుపై తలెత్తిన ఉత్కంఠకు తెరపడనుంది. తగినంత సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ ఆర్లేకర్‌ను మరోసారి విజయ్ కలుసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. వీసీకే, సీపీఎం, సీపీఎం పార్టీలు టీవీకేకు మద్దతు ప్రకటించాయని, మద్దతు లేఖలు తీసుకుని గవర్నర్‌ను కలుస్తారని ఆ వర్గాలు వెల్లడించాయి. బుధ,గురువారాల్లో గవర్నర్‌ను విజయ్ కలిశారు. అయితే సంఖ్యాబలంతో రావాలని గవ్నరర్ సూచించడంతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటులో జాప్యం తలెత్తింది.టీవీకే బలంపరంగా చూస్తే ఆ పార్టీకి విజయ్ గెలిచిన రెండు నియోజకవర్గాలతో సహా 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు టీవీకేకు మద్దతు ప్రకటించడంతో ఆ బలం 113కు చేరింది. టీవీకే బలనిరూపణకు మరో ఆరు సీట్లు అవసరం. టీవీకే భవితవ్యాన్ని నిర్దేశించే బలం వీసీకే, సీపీఐ, సీపీఎం చేతుల్లో ఉంది. వీసీకే-2, సీపీఐ-2,సీపీఎం-2 సీట్లు గెలుచు



కున్నాయి. ఈ పార్టీలు టీవీకేతో జతకడితే సింపుల్ మెజారిటీతో టీవీకే ప్రభుత్వం ఏర్పాటు సాధ్యమవుతోంది. ఈ నేపథ్యంలో సీపీఐ వర్కింగ్ కమిటీ, సీపీఎం రాష్ట్ర కమిటీ టీవీకేకు మద్దతు ప్రకటించినట్టు తెలుస్తోంది. వీసీకేకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు కూడా మద్దతు ప్రకటించినట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించిన ఈ మూడు పార్టీలు తుది ప్రకటన చేయనున్నాయి.

## ముఖ్యమంత్రిగా, హోంమంత్రిగా రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్: హరీశ్ రావు

**హైదరాబాద్,మే 08:**రేవంత్ రెడ్డి పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. చీజ=దీ గణాంకాలతో తెలంగాణలో నేరాల భయానక పరిస్థితి బయటపడిందన్నారు.

కరీంనగర్ నగల దుకాణం దొంగలను ఇప్పటికి పట్టుకోలేక సాకులు చెబుతున్నారని అందరూ చూస్తుండగానే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలపై దాడి జరిగితే ఇవాళ ఐఏఎస్ క్వార్టర్స్ లో ఏకంగా ఐపీఎస్ అధికారిని భార్య హత్య చేశారన్నా రు.సీపీ సుమతి ఆపరేషన్‌తో మహిళల భద్రత బట్టబయలైందని ముఖ్య మంత్రిగా,హోంమంత్రిగా రేవంత్ రెడ్డిఅట్టర్ ఫ్లాప్ అయ్యారని విమర్శించారు.



# సంపాదకీయం

## మండే సూరీడు.

సూర్య భగవానుడు మండిపోతున్నాడు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు చల్లబడ్డ వాతావరణం.. ఒక్కసారిగా వేడెక్కింది. సోమవారం రాష్ట్రంలోనే నిర్మల్ మండలంలోని అక్కాపూర్ గ్రామంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి కాలం ముందే వచ్చేసింది. మార్చి నెల ఆరంభం నుంచే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ




ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. మరో 2 నెలలు కష్టమేనని చెప్పింది. ప్రస్తుతం 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఇక మే నెలలో నలభై ఐదు డిగ్రీలు దాటే అవకాశముందని అంచనా వేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. అనేక ప్రాంతాల్లో సాధరణం కంటే నాలుగైదు డిగ్రీలు అత్యధికంగా ఉష్ణోగ్రతలు నవోదవుతున్నాయి. ఇక వాడగాల్పులు కూడా ప్రారంభమయ్యాయి. ఉదయం వేళ కొంత చల్లగాలులు వీస్తున్నా ఉదయం పది గంటల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత ప్రారంభం అవుతుండటంతో వడదెబ్బ తగిలే అవకాశముందని వాతారణ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే మూల్యంచెల్లించుకోవాల్సి ఉంటుందని, ప్రాణాల మీదకు తెచ్చుకోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశముందని, డీహైడ్రేషన్ కు లోను కాకుండా ప్రజలు తరచూ నీటిని తాగుతూ ఉండాలని సూచిస్తున్నారు. తెలంగాణలోనూ హైదరాబాద్ నగరం ఉదయం పది గంటలకే వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడే వారు ఇంటి నుంచి బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. ప్రజలు ఇప్పటికే అనేక వ్యాధులు బారిన పడి ఆసుపత్రులలో చేరుతున్నారని వైద్యులు చెబుతున్నారు. తీవ్రమైన జ్వరంతో పాటు జలుబు, దగ్గు, ఒళ్లునొప్పుల వంటి వాటితో వస్తున్నారని, కొందరు జ్వరంతో స్పృహకోల్పోతున్నారని కూడా చెబుతున్నారు. ఎండల తీవ్రతకు వ్యాపారాలు దెబ్బతినడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఆహార విషయాల్లో కూడా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఢిల్లీ సహా ఉత్తర భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో ఈ వీకెండ్‌లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఢిల్లీలోని కొన్ని ఏరియాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటాయి. ఎండల తీవ్రత పెరగడంతో అధికారులు ఈ హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో మధ్యప్రదేశ్, రాజస్థాన్ సహా మధ్య, పశ్చిమ భారత్‌లోని కొన్ని రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నవోదవుతాయుని వాతావరణ శాఖ హెచ్చరించింది. వేసవికాలంలోని తీవ్రమైన ఎండలు ప్రాణాంతకంగా మారొచ్చు. తీవ్రమైన వేడి వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం కావచ్చు. ఉత్తర, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు వారాంతంలో మరో 2-3 డిగ్రీల సెంటిగ్రేడ్ పెరిగే అవకాశం ఉందని శుక్రవారం వాతావరణ శాఖ తెలిపింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవడానికి పాఠశాలలకు ఢిల్లీ విద్యా శాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. బహిరంగ ప్రదేశాల్లో క్లాస్‌లు నిర్వహించకూడదని, ఎండలో జరిగే స్కూల్ అసెంబ్లీలను తగ్గించాలని లేదా ఇండోర్‌లో నిర్వహించాలని సూచించింది. పిల్లలు నీళ్లు తాగాలని గుర్తు చేసేందుకు ప్రతి 45-60 నిమిషాలకు ఒకసారి బెల్ మోగించాలని కూడా సూచించింది. 2024లో భారత్ ఎదుర్కొన్న మూడింట ఒకవంతు వడగాల్పులకు వాతావరణ మార్పులే కారణమని ఆ ఏడాది మెడికల్ జర్నల్ లాన్సెట్ ప్రచురించిన ఒక రిపోర్టులో పేర్కొన్నారు. 2024లో తీవ్రమైన ఎండల కారణంగా దాదాపు 247 బిలియన్ గంటల(24,700 కోట్ల గంటలు) పని సమయాన్ని కోల్పోయినట్లు, దానివల్ల 19,400 కోట్ల డాలర్ల ఆదాయం నష్టపోయినట్లు ఈ రిపోర్ట్ అంచనా వేసింది. ప్రధానంగా వ్యవసాయం, నిర్మాణరంగం వంటి సెక్టార్లు ప్రభావితమైనట్లు పేర్కొంది. ఎక్కువ సమయం పాటు తీవ్రమైన వేడికి గురవ్వడం వల్ల ఆరోగ్యంపై పలు దుష్ప్రభావాలు ఉంటాయని నిపుణులు అంటున్నారు. ఉష్ణోగ్రతలు పెరిగితే డీహైడ్రేషన్, వడదెబ్బ, గుండె సంబంధిత ఒత్తిడి, మరణం సంభవించే ప్రమాదం పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పసిపిల్లలు, వృద్ధులు, ఆరుబయట పనిచేసే కార్మికుల్లో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. వేడి ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా తాగాలి. కనీసం రోజుకు 3 నుంచి 4 లీటర్లు నీరు తాగాలి. కాకరకాయ, దోసకాయ, సొరకాయ వంటి వాటర్ రిచ్ కూరగాయలు డైట్లో చేర్చుకోవాలి. ఇవి శరీరాన్ని కూల్‌గా ఉంచుతాయి. నీటి శాతం ఎక్కువగా ఉండే వాటర్‌మెలన్, మస్క్‌మెలన్ కూడా తీసుకోవచ్చు. ఇవి మీకు ఫ్రెష్ ఫీల్ ఇస్తాయి. బొప్పాయిని కూడా వేసవిలో తీసుకుంటే మంచిది. ఇది జీర్ణ సమస్యలను దూరం చేసి.. శరీరాన్ని లైట్‌గా ఉండేలా చేస్తుంది. మజ్జిగ శరీరానికి చల్లదనం ఇచ్చి డీహైడ్రే షన్‌ను తగ్గిస్తుంది. నిమ్మరసం విటమిన్ అతో పాటు ఎలక్ట్రోలైట్స్ అందిస్తుంది. కొబ్బరి నీరు నేచరల్ ఎలక్ట్రోలైట్ డ్రింక్? అవుతుంది. వెంటనే ఎనర్జీ అందిస్తుంది. వేసవిలో ఎక్కువ మసాలాలు ఉండేవి కాకుండా లైట్ ఫుడ్స్ తీసుకుంటే మంచిది. అవి సులభంగా జీర్ణమవుతాయి. ఎండలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. కానీ బయటకు వెళ్లాల్సి వస్తే.. నీరు తీసుకెళ్లండి. ఎక్కువ సేపు ఎండలో ఉండొద్దు. లైట్, కాటన్ దుస్తులు వేసుకోండి. మధ్యాహ్నం 12 నుంచి 3మధ్య బయటకు వెళ్లడంతగ్గించండి.



# వాతావరణ సంక్షోభం వైపు భారత్

మన దేశం బహుళ వాతావరణ సంక్షోభం అంచులపై ఉంది. గణాంకాలు, అనుభవాలు, రోజువారీ జరుగుతున్న సంఘటనలు ఈ వాస్తవాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ఈ సంక్షోభం ఒక్కసారిగా ఉద్భవిం చింది కాదు, సంవత్సరాలుగా కూడబెట్టుకున్న పర్యావరణ నిర్లక్ష్యం, అభివృద్ధి నమూనాల్లోని అసమతుల్యతల ఫలితమే అన్నది ఛేదు నిజం. భారత వాతావరణ విభాగం ప్రకారం 2025 సంవత్సరం దేశ చరిత్రలో ఎనిమిదవ అత్యంత వేడిమి సంవత్సరంగా నమోదైంది. సగటు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 0.28లీజ అధికంగా నమోదయ్యాయి. ఈ సంఖ్య చిన్నదిగా కనిపించినా, వాతావరణ శాస్త్రంలో ఇది తీవ్రమైన మార్పులకు సంకేతం. ముఖ్యంగా 2016--2025 దశకం దేశ చరిత్రలోనే అత్యంత వేడి కాలంగా నిలవడం పరిస్థితి తీవ్రతను మరింత స్పష్టంగా చూపుతోంది. 2026లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది. మార్చి నెల నుంచే పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4లీజ నుంచి 8లీజ వరకు అధికంగా నమోదవుతున్నాయి. వసంత కాలం క్రమంగా క్షీణించి, వేసవి ముందుగానే దాడి చేస్తోందన్న నిపుణుల అభిప్రాయం దీనికి బలం చేకూరుస్తోంది. 2025 సంత్సరంలో దాదాపు 330కి పైగా రోజుల్లో దేశవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట తీవ్రమైన వాతావరణ ఘటనలు నమోదయ్యాయి. తొలి తొమ్మిది నెలల్లో 99% రోజుల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం, ఈ పరిస్థితి ఎంత సాధారణంగా మారిందో తెలియజేస్తోంది. ఈ ఘటనల ఫలితంగా 4,000కు పైగా ప్రాణ నష్టం సంభవించగా, 94.7 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు నష్టపోవడం జరిగింది. లక్షకు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. వాతావరణ మార్పు అనేది ఒకే ఒక్క విపత్తుగా కాకుండా, నిరంతర సంక్షోభంగా మారిందని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఉష్ణోగ్రతలలో తేడా.. పెరిగిన వడగాలుల తీవ్రత...: దేశంలో ఉష్ణోగ్రతల పెరుగుదలతో వడగాలుల తీవ్రత గణనీయంగా పెరిగింది. వాతావరణ విభాగం గణాంకాలను పరిశీలిస్తే 2015లో కేవలం 9 రాష్ట్రాల్లో నమోదైన వడగాలులు, 2020 నాటికి 23 రాష్ట్రాలకు విస్తరించాయన్నది విధితమవుతుంది. దేశంలో వడగాలుల రోజులు 7.4 నుంచి 32.2కు పెరిగాయి. ప్రతి సంవత్సరం 1,000 మందికి పైగా వడగాలుల కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. దేశంలోని సుమారు 57% జిల్లాలు తీవ్రమైన వేడి ప్రమాదంలో ఉన్నట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. తాజాగా శాస్త్రీయ విశ్లేషణలు కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మానవ శరీరం తట్టుకోలేని స్థాయికి చేరుతున్నాయని హెచ్చరిస్తున్నాయి. ఇది కేవలం పర్యావరణ సమస్య కాకుండా, ప్రజా ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా మారుతోంది.

వ్యవసాయ రంగం పై ప్రభావం...: వ్యవసాయం రంగం కూడా ఈ మార్పుల బారిన పడుతోంది. దేశ జనాభాలో 45% మంది వ్యవసాయంపై ఆధారపడుతున్నప్పటికీ, రుతుపవనాల అస్థిరత రైతులను తీవ్ర సంక్షోభంలోకి నెడుతోంది. వర్షపాతం విషయానికొస్తే సమయపాలన లోపించడం, అధిక వర్షాలు పంటల వైఫల్యానికి దారి తీస్తున్నాయి. 2026లో మాన్సూన్ సాధారణం కంటే సుమారు 94% స్థాయిలోనే ఉండే అవకాశమున్నట్లు అంచనాలు సూచిస్తున్నాయి. ఇక 40% జిల్లాల్లో వరద ప్రాంతాలు క్రమంగా కరవు ప్రాంతాలుగా మారుతున్నాయి. ఇలాగే కొనసాగితే దీర్ఘకాల కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉంది. వేడెక్కుతున్న సముద్రాలు.. కరుగుతున్న హిమానీ నదాలు...: మన దేశం మూడు వైపులా ఉన్న సముద్రాలు వేడెక్కడం మరో ప్రధాన ఆందోళన. సముద్ర ఉష్ణోగ్రతల పెరుగుదలతో తుపానుల తీవ్రత పెరుగుతోంది. సముద్ర మట్టం పెరగడం వల్ల తీరప్రాంతాల్లో వరదలు అధికమవుతున్నాయి. 1995--2024 మధ్యకాలంలో ప్రపంచంలో అత్యధిక వాతావరణ ప్రభావిత దేశాల్లో భారత్ టాప్-10లో ఉండ టం ఈ ప్రమాదం స్థాయిని తెలియజేస్తోంది. మరోవైపున హిమాల యాల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉంది. హిమనీనదాల కరుగుదల వేగవంతమవుతోంది. దీని ఫలితంగా నదుల ప్రవాహం అస్థిరంగా మారే ప్రమాదం ఉంది. భవిష్యత్తులో సాగునీటి కొరత, తాగునీటి సమస్యలు, వలసలు పెరగడం వంటి సమస్యలు తలెత్తే అవకాశముంది. ఇటీవల హిమాలయ ప్రాంతాల్లో కూడా వడగాలుల ప్రభావం కనిపించడం కొత్త హెచ్చరికగా భావించాలి.

ప్రజల అనుభవాల్లోనూ...: వాతావరణ మార్పు ప్రభావం కేవలం గణాంకాల్లోనే గాక ప్రజల అనుభవాల్లోనూ స్పష్టంగా కనిపిస్తోంది. కొన్ని సర్వేలు చెబుతున్నట్లు దేశంలో 71% మంది తీవ్ర వడగాలులను అనుభవించగా, 52% మంది నీటి కొరతను ఎదుర్కొంటున్నారు, అలాగే 34% మంది వరదలను చూశారు. వాతావరణ మార్పు ఇప్పుడు ప్రజల రోజువారీ జీవితాల్లో ప్రత్యక్ష వాస్తవంగా మారింది.

తక్షణ చర్యలు అవసరం...: ఈ మొత్తం దృశ్యం ఒకే సందేశాన్ని ఇస్తోంది. వాతావరణ మార్పు భవిష్యత్తు సమస్య కాదు; ఇది ఇప్పటికే దేశాన్ని ప్రభావితం చేస్తున్న సంక్షోభం. ఉష్ణోగ్రతల పెరుగుదల వెనుక ఆర్థిక నష్టం, ఆహార భద్రత సమస్యలు, ఆరోగ్య సంక్షోభం, సామాజిక అసమానతలు అన్నీ దాగి ఉన్నాయి.

# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !



రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్ధం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్‌ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్‌ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్‌ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్‌ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజసమైనది. నయాయబద్ధమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడా నికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్‌ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు.

## నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందు పై ప్రతిష్టమైన చర్యలు

ఆదిలాబాద్: స్థానిక పోలీస్ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ సిబ్బంది అందరితో నెలవారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా నమోదైన నేరాలపై సమగ్రంగా సమీక్ష చేపట్టి, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలపై అధికారులకు జిల్లా ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎండాకాలం నేపథ్యంలో చెరువులు, వాగులు, నదుల వద్ద ఈతకు వెళ్లే యువతకు భద్రతా సూచనలు విస్తృతంగా చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. లోతు తెలియని ప్రదేశాల్లో ఈతకు దిగకూడదని, మద్యం సేవించి నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలను పూర్తిగా నివారించేలా ప్రజలకు చైతన్యం కల్పించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు, నిషేధిత గడ్డి మందుల విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ కొనసాగించాలని, రైతులను మోసం చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి సమగ్ర అవగాహనతో, చట్టబద్ధంగా పరిష్కారాలు చూపేలా సిబ్బందికి శిక్షణ అందించారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు మెరుగుపడేలా ఎస్హెచ్‌ఓలు పర్యవేక్షణ పెంచాలని, ప్రతి ఒక్కరికీ సమాన విధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగిస్తూ,




# ఆర్ఎఫ్‌సీఎల్ గేట్ వద్ద కార్మికుల సమ్మెలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

## -నో బిహారి నో బహారి .. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలి-

## నా చివరి శ్వాస వరకు మీకు అండగా ఉంటాను



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) ఆర్ఎఫ్‌సీఎల్ గేట్ వద్ద కొనసాగుతున్న కార్మికుల సమ్మెలో శుక్రవారం సాయంత్రం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కార్మికులకు రావాల్సిన హక్కులు మరియు సరైన వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. “మీరు అందరూ నా కుటుంబ సభ్యులు. మీకు ఏ సమస్య వచ్చినా నేను అండగా ఉంటాను. స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా బయటివారిని తీసుకురావడం సరైంది కాదు” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఓసిపి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపు కోసం గతంలో చేసిన పోరాటాన్ని గుర్తు చేస్తూ, కార్మికుల కోసం తాను ఎప్పుడూ ముందుంటానన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ రైతులకు ఎంతో కీలకమైన సంస్థ అని, రైతులకు యూరియా సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సీఎం మరియు డిప్యూటీ సీఎం సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబుతో ఈ సమస్యపై చర్చిస్తామని, కార్మికులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. “ఈ సమస్య రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారిస్తామని అన్నారు. వీర్లపల్లి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ విషయంలో గత నాయకులు ప్రజలను మోసం చేశారని విమర్శించిన ఎమ్మెల్యే, “నా తల్లి సాక్షిగా చివరి శ్వాస వరకు ప్రజల కోసం పని చేస్తాను” అంటూ భావోద్వేగంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు ఫోన్ ద్వారా కార్మికులతో మాట్లాడుతూ..లి సమస్య పరిష్కారానికి అధికారులతో త్వరలో చర్చలు జరుపుతామని తెలిపారు. ఆర్ఎఫ్‌సీఎల్ వంటి కీలక ప్రాజెక్టులో స్థానికులకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వారిని నియమించడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని కార్మికులు తెలిపారు. కార్మికులు ఐక్యంగా పోరాటం కొనసాగించాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు.

# తిరుపతికి తగ్గిన విమాన ప్రయాణాలు

## విమాన ధరలతో ప్రయాణజకులక వెనకడుగు

## భక్తులు తగ్గడంతో శ్రీవాణి టిక్కెట్లపై ప్రభావం




తిరుపతి : విమాన ప్రయాణ ధరలు తిరులమ భక్తులపై పడింది. గల్ఫ్ యుద్ధంతో భారీగా పెరిగిన విమాన ధరల కారణంగా తిరుపతికి వచ్చే విమాన ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. దీంతో ఈ ప్రభావం శ్రీవాణి టిక్కెట్లపైనా పడింది. తిరుపతి విమానాశ్రయంలో ఒకటిన్నర నెలలుగా శ్రీవాణి ట్రస్టు దాతలకు జారీ చేసే టికెట్లు మిగిలిపోతున్నాయి. రోజూ 40 శాతానికిపైనే టికెట్లు జారీ చేయకుండానే కౌంటర్‌ను మూసివేయాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం టీటీడీ రోజూ ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా 800, విమానాశ్రయంలో 200 చొప్పున శ్రీవాణి టికెట్లను జారీ చేస్తోంది. ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా ఉదయం తొమ్మిది గంటలకు విడుదల చేసే 800 టికెట్ల కోటా క్షణాల్లో పూర్తవుతుంటే విమానాశ్రయంలో జారీ చేసే 200 టికెట్లలో సగానికిపైగానే మిగిలిపోతున్నాయి. గతంలో రోజూ ఉదయం ఏడు గంటల నుంచి హైదరాబాదు నుంచి తిరుపతికి ఐదు విమాన సర్వీసులు నడిచేవి. ఈక్రమంలో మధ్యాహ్నం 11 గంటలకే 200 టికెట్ల కోటా విక్రయాలు పూర్తయ్యేవి. ఇటీవల యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ ధరలు భారీగా పెరిగాయి. విమాన టికెట్ల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగానే ప్రయాణికుల రాకపోకలు చాలావరకు తగ్గిపోయిన క్రమంలో హైదరాబాద్ నుంచి వచ్చే కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశారు. సాధారణంగా శ్రీవాణి టికెట్లు కలిగిన భక్తులకు అదేరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి దర్శనం కల్పిస్తారు. ఈక్రమంలో రెండు గంటల ముందు అంటే మధ్యాహ్నం రెండు గంటలకు విమానాశ్రయంలోని కౌంటర్‌ను మూసివేస్తున్న క్రమంలో రోజూ 50 నుంచి 100 టికెట్లు మిగిలిపోతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి 22వ తేదీ వరకు పరిశీలిస్తే 4,400 టికెట్లు అందుబాటులో ఉంచితే 2,980 విక్రయం కాగా, 1420 మిగిలిపోయాయి. తాజాగా మంగళవారం కూడా 90 టికెట్లు విక్రయం కాగా, 110 టికెట్లు మిగిలిపోయాయి. మామూలుగానే శ్రీవాణి టికెట్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈక్రమంలో మిగిలిన టికెట్లను ఆన్‌లైన్ కరెంట్ బుకింగ్ ద్వారా కేటాయిస్తే మిగిలిన భక్తులు వినియోగించుకుంటారని, లేదా తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలకు విపరీతమైన ఒత్తిడి నెలకొంటున్న సమయంలో సిఫార్సులపై కేటాయించినా ఈ టికెట్లు వృథా కావనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పేరుకు పోతున్న ధాన్యపురాశులు..

శంకరపట్నం : దేశానికి వెన్నెముకైన రైతన్నకు ధాన్యం అమ్మకంలో అవస్థలు తప్పడం లేదు. గత 15రోజుల క్రితమేవరి కోతలు ప్రారంభమైనప్పటికీ, మండలంలోని మూడు సహకార సంఘాల పరిధిలోని ఐకేపీ కేంద్రాల్లో ధాన్యపు నిల్వలు పెరిగిపోతున్నాయి. కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడం, ప్రారంభించిన తర్వాత కూడా కాంటాలు వేయడంలో నిర్లక్ష్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్లు ప్రారంభమై వారం రోజులు గడిచినా సరైన స్థాయిలో కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు కల్లాల్లోనే కళ్లల్లో వత్తులు వేసుకుని కాంటాల కోసం ఎదురు చూస్తున్నారు. వాహనాలకు జీపీఎస్ పేరుతో కొనుగోళ్లు బంద్: రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చిన ధాన్యాన్ని రోజులు గడిచినా కొనుగోలు చేయకపోవడంపై అధికారుల తీరు పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లు ప్రారంభించిన రోజే వాహన యజమానులకు జీపీఎస్ ట్రాకర్ విషయం తెలియజేయలేదు. ఇప్పుడు అకస్మాత్తుగా ధాన్యం రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరి చేయడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. జీపీఎస్ పేరుతో కొనుగోళ్లు నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రబీ సీజన్‌లో కూడా అన్నదాతకు కష్టాలే: రబీ సీజన్ ప్రారంభంలోనే యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. యూరియా బస్తాల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆరుగాలం కష్టపడి పంట పండించిన తర్వాత, ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడం రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

# విజయసాయిరెడ్డి వ్యూహం ఏమిటీ



విజయవాడ, : నో పాలిటిక్స్..ఓన్లీ అగ్రికల్చర్ అన్న మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి..పొలిటికల్ రీఎంట్రీపై ఔట్ రైట్ స్టేట్ మెంట్ ఇచ్చేశారు. జులై నెలలో మళ్లీ క్రియాశీలక రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించారు. ఏపీ పాలిటిక్స్‌లో మరో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించాల్సిన అవసరం ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తున్నాయి. విజయసాయిరెడ్డి చేసిన ప్రకటన రాజకీయంగా ఆసక్తి పెంచుతోంది. అయితే ఇన్నాళ్లు వైసీపీ, జగన్ కోసమే సాయిరెడ్డి ఆరాటమంటూ టీడీపీ నేతలు విమర్శించు కుంటూ వచ్చారు. చంద్రబాబు డైరెక్షన్‌లో..బీజేపీ లైన్‌లో సాయిరెడ్డి గేమ్ ఆడుతున్నారంటూ వైసీపీ అటాక్ చేస్తూ వచ్చింది. ఇప్పుడు ఆ ఇద్దరి విమర్శలకు చెక్ పెట్టేలా సాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన చేసినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. అయితే సాయిరెడ్డి పార్టీ ప్రకటన వెనక అసలేం జరుగుతోంది? ఆయన చెప్తున్నట్లుగా ఏపీలో పొలిటికల్ వాక్యూమ్ ఉందా.? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ఏపీలో కూటమి వర్సెస్ వైసీపీ నెక్స్ట్ లెవల్ పొలిటికల్ ఫైట్ నడుస్తోంది. ఇలాంటి టైమ్‌లో ఏపీలో పొలిటికల్ వాక్యూమ్ ఉందంటూ..అటు వైసీపీ..ఇటు సీఎం చంద్రబాబు టార్గెట్‌గా సాయిరెడ్డి కామెంట్స్ చేయడం ఆసక్తిక రంగా మారింది. ఒకవేళ సొంత కుంపటి పెట్టినా విజయసాయిరెడ్డి పార్టీని నడపగలరా.? ఆయన రాజకీయ లక్ష్యమేంటి.? ఏపీ పాలిటి క్స్‌లో సాయిరెడ్డి టార్గెట్ ఎవరినేది పొలిటికల్ ఇంట్రెస్టింగ్ ఎనాలిసిస్ అయిపోయింది. మరోవైపు సాయిరెడ్డి పార్టీ పెడతానంటూ ప్రకటన చేసిన సందర్భం కూడా సమ్‌థింగ్ డిఫరెంట్. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ఈడీ రైడ్స్ అయిపోయాక సాయిరెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి పొలిటికల్ రీఎంట్రీపై క్లియర్ కట్ క్లారిటీ ఇవ్వడం వెనుక ఫ్రస్ట్రేషన్ ఉందా అన్న డిస్కషన్ నడుస్తోంది. ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో విజయసాయిరెడ్డి అప్రూవర్‌గా మారారు. కీలక నిందితులు, వారి వ్యవహారాలన్నింటిపై సాయిరెడ్డే సిట్, ఈడీ అధికారులకు కీలక సమాచారం ఇచ్చినట్లు బయట టాక్ ఉంది. అయితే ఇక్కడే సాయిరెడ్డి హర్ట్ అయి ఉంటారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. తాను అప్రూవర్‌గా మారి..జగన్ కోటరీని టార్గెట్ చేస్తున్నా..తన ఇంట్లో ఈడీ సోదాలు చేయడం సాయిరెడ్డిలో ఫ్రస్ట్రేషన్‌కు దారి తీయొచ్చన్న టాక్ నడుస్తోంది. ఇందులో భాగంగానే ఈడీ రైడ్స్ అయిపోగానే పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేసి ఉంటారన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఈ సారి అటు వైసీపీకి, ఇటు చంద్రబాబు సరిసమానంగా ఇచ్చిపడేశారాయన. ఏపీలో వైసీపీ పని అయిపోయిదన్న సాయిరెడ్డి..టీడీపీకి ప్రజలు మళ్లీ అవకాశం ఇవ్వరంటున్నారు. ఇంకోవైపు చంద్రబాబు అవినీతి అంటూనే..ఏపీలో పొలిటికల్ వాక్యూమ్ ఉంది..తాను పార్టీ పెడతానంటున్నారు. ఇంతకు విజయసాయిరెడ్డి కాన్ఫిడెన్స్ ఏంటి? ఆయన పార్టీ పెట్టడం పక్కానా? రాజకీయ పార్టీ పెట్టి నెట్టుకురాగలరా? అనేది కాలమే నిర్ణయించాలి.

# మహిళా కార్మికురాలి పై పాటల రూపంలో దాడిని ఖండించండి


## కే జ్యోతి ప్రగతిశీల మహిళా సంఘుంల (పి ఓ డబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు



(తెలంగాణ అవతరణ ప్రతినిధి గోదావరిఖని) గత కొన్ని రోజులుగా సింగరేణిలో పనిచేస్తున్న మహిళా కార్మికురాలు ను అవమాన పరుస్తూ అసభ్యకరంగా పాట రాసి సోషల్ మీడియాలో పెట్టి ప్రచారం చేయడాన్ని ప్రగతిశీల మహిళా సంఘం (పి ఓ డబ్ల్యూ) ఖండిస్తుంది. సింగరేణి వ్యాప్తంగా అనేక మంది మహిళ కార్మికురాళ్ళు పని చేస్తున్నారని పని స్థలాలలో అనేక అవమానాలు పడుతూ, వివక్ష కు గురైతు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ మధ్యకాలంలో కొంత మంది ఏకంగా మహిళ కార్మికురాలిపై అసభ్య పాదజాలంతో పాటలు రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. సమాజంలో మహిళలు ఎన్నో అవమానాలకు గురవుతున్నారని ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలి తప్ప ఇలాంటి పాటలు రాసి సోషల్ మీడియాలో పెట్టడం ద్వారా వారి మనోభావాలను దెబ్బతీస్తాయని మహిళలను అవమానించే విధంగా కొంతమంది పనిగట్టుకుని ప్రచారం చేయడం ఆపాలన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పని స్థలాల్లో మహిళలకు భద్రత కల్పించాలని జ్యోతి డిమాండ్ చేశారు.







# సినిమా

## నాగార్జున సరసన మరోసారి టబు




అక్కినేని నాగార్జున కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోనున్న 100వ చిత్రంలో సీనియర్ నటి టబు నటిస్తున్నారంటూ వస్తున్న వార్తలకు స్వయంగా ఆమే తెరదించారు. ఈ సినిమాలో తాను నటిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తన సోషల్ మీడియా ఖాతాలో మూవీ క్లాప్‌బోర్డు ఫొటోను షేర్ చేసి, ఊహాగానాలకు ముగింపు పలికారు. చిత్ర యూనిట్ అత్యంత గోప్యంగా చిత్రీకరణ జరుపుతుండగా, టబు పోస్ట్‌తో ఈ విషయం తొలిసారిగా బయటకు వచ్చింది. టబు పోస్ట్‌పై దర్శకుడు రా. కార్తీక్ స్పందిస్తూ, "మేడమ్, మీతో కలిసి పనిచేయడం చాలా ఆనందంగా ఉంది" అని కామెంట్ చేశారు. 'కింగ్ 100' అనే వర్కింగ్ టైటిల్‌తో గతేడాది అక్టోబరులోనే ఈ సినిమా ప్రారంభమైంది. ప్రస్తుతం షూటింగ్ వేగంగా జరుగుతోంది. యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగార్జున సరికొత్త లుక్‌లో కనిపించను న్నారని తెలుస్తోంది. దాదాపు 28 ఏళ్ల క్రితం 'నిన్నేపెళ్లాడతా' సినిమాతో నాగార్జున, టబుజంట టాలీవుడ్‌లో హిట్ పెయిర్‌గా నిలిచింది.

ఆ తర్వాత 'ఆవిడా మా ఆవిడే'లోనూ కలిసి నటించారు. ఇంత సుదీర్ఘ విరామం తర్వాత ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించనుం డటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. అయితే, ఈ చిత్రంలో టబు నాగార్జునకు జోడీగా నటిస్తున్నారా లేక మరేదైనా కీలక పాత్ర పోషిస్తున్నా రా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు ఉంటారనే ప్రచారం కూడా జరుగుతోంది.

## పెద్ది ఐటెం సాంగ్ లీక్..

### చరణ్‌తో కాలు కదిపేది ఎవరో తెలిసిపోయింది..




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'పై రోజురోజుకు హైప్ పెరుగుతోంది. మొదట ఈ సినిమాను ఏప్రిల్ 30న విడుదల చేయాలని ప్లాన్ చేసినప్పటికీ, కొన్ని కారణాల వల్ల రిలీజ్ వాయిదా పడింది. ఇప్పుడు ఈ చిత్రాన్ని జూన్ 25న విడుదల చేయాలని నిర్ణయించినట్టు దర్శకుడు బుచ్చిబాబు ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో వెల్లడించారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది. ముఖ్యంగా ఒక మాస్ ఐటెమ్ సాంగ్ చిత్రీకరణ జరుగుతున్న సమయంలో, షూటింగ్ స్పాట్ నుంచి ఓ వీడియో లీక్ కావడం ఆసక్తికరంగా మారింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. లీక్ అయిన వీడియోలో శృతి హాసన్, రామ్ చరణ్ కలిసి మాస్ స్టెప్పులతో అదరగొడుతున్నట్టు కనిపిస్తున్నారు. చరణ్ తన ఎనర్జీ, స్టైల్‌తో డ్యాన్స్ చేస్తుంటే, శృతి హాసన్ కూడా అతనికి తగ్గట్టే స్టెప్పులు వేస్తూ ఆకట్టుకుంటోంది. ఈ జంటను మళ్లీ తెరపై చూడబోతున్నారనే వార్త అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచింది. ఎవడు సినిమా తర్వాత రామ్ చరణ్, శృతి హాసన్ జంటగా కనిపించడం ఇదే మొదటిసారి కావడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. దర్శకుడు బుచ్చిబాబు ఈ సినిమాను ఉత్తరాంధ్ర ప్రాంతం నేపథ్యంగా పీరియడ్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ మాస్ లుక్‌లో కనిపించనున్నాడు. కథాపరంగా కూడా ఈ సినిమా విభిన్నంగా ఉండనుందని సమాచారం. చరణ్ ఇందులో కేవలం క్రికెట్ ప్లేయర్‌గా మాత్రమే కాకుండా కుస్తీ ఫైటర్‌గా కూడా కనిపించనున్నాడని టాక్ వినిపిస్తోంది. ఈ అంశం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ ఐటెమ్ సాంగ్‌కు సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ మాస్ బీట్ అందించినట్టు సమాచారం. లీక్ వీడియోలో వినిపిస్తున్న సంగీతం, డ్యాన్స్ మూమెంట్స్ ఇప్పటికే అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. 'పెద్ది' సినిమా షూటింగ్ నుంచి లీక్ అయిన ఈ వీడియో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అవుతూ, చిత్రంపై అంచనాలను మరింత పెంచుతోంది. విడుదల తేదీ సమీపిస్తున్న కొద్దీ మరిన్ని అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రాజ్ సెలబ్రేషన్ పిక్స్ వైరల్




సినిమాలతో పాటు వ్యక్తిగత జీవితంతో ఎప్పుడూ వార్తల్లో నిలిచే స్టార్ హీరోయిన్ సమంత మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఏప్రిల్ 28న ఆమె పుట్టినరోజు సందర్భంగా, ఆమె కు సంబంధించిన పలు విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే 2023 లోనే సిటాడెల్ సిరీస్ షూటింగ్ సమయంలో సమంత భర్త రాజ్ నిడిమోరు ఆమె పుట్టిన రోజుని అర్ధరాత్రి ఘనంగా సెలబ్రేట్ చేయగా, ఈ పిక్స్ సమంత అప్పట్లో అధికారికంగానే పోస్ట్ చేసింది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తుందని రూమర్స్ రాగా ఈ ఫొటోలు మరింత బలం చేకూర్చాయి. ఎట్టకేలకి 2025 డిసెంబర్ లో రాజ్ – సమంత పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వీరి పెళ్లి తర్వాత వచ్చిన సమంత మొదటి పుట్టిన రోజు కావడంతో ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. మరో వైపువ బర్త్‌డేకు రెండు రోజుల ముందు షేర్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.'బర్త్‌డే వీక్' అంటూ సమంత తన జీవితంలో గత ఏడాది జరిగిన మార్పులను సూచిస్తూ కొన్ని ఫోటోలు పంచుకున్నారు. వాటికి జోడించిన వ్యాఖ్యలు అభిమానులను ఆలోచింపజేస్తున్నాయి. తనతో ఉన్నది ఏమిటి? వదిలేసింది ఏమిటి? జీవిత ప్రయాణంలో పోయినవి, మిగిలినవి ఏవో ఆమె చాలా సూటిగా వెల్లడించారు.తన ప్రయాణం ప్రారంభం గురించి చెబుతూ... పని మీద ప్రేమ, ముందుకు నడిపించే ఆత్మవిశ్వాసమే ఇప్పటికీ తన బలం అని సమంత పేర్కొన్నారు. అయితే ఎప్పుడూ ఇతరుల ఎంపిక కోసం ఎదురుచూసే స్వభావాన్ని మాత్రం వదిలేశానని తెలిపారు. జీవితంలో ప్రతీది ప్లాన్ ప్రకారం జరగకపోయినా, తన మనసు చెప్పేది వినే తీరు మారలేదని చెప్పారు. కానీ తనను నియంత్రించాలనే ఆలోచనను మాత్రం విడిచిపెట్టినట్లు వెల్లడించారు. ప్రతిదీ మారినా నా సంకల్పం మారలేదు అని సమంత చెప్పడం గమనార్హం. తాను ఎలా ఉండాలని అనుకున్నానో ఆ భావనను కూడా ఇప్పుడు వదిలేశానని చెప్పడం ద్వారా, గతంలో జరిగిన వ్యక్తిగత పరిణామాలను సూచించినట్టుగా అనిపిస్తోంది. ప్రస్తుతం తన జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉందని, తొందరపడే స్వభావాన్ని కూడా వదిలేశానని సమంత చెప్పారు. ప్రతి ఫోటో వెనుక ఒక లోతైన భావం దాగి ఉందని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## పిల్లల్ని కనడానికి.. పెళ్లికి ఏం సంబంధం



గ్లామర్ ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకమైన ఇమేజ్‌ను క్రియేట్ చేసుకున్న నటి నిత్యామీనన్. నటనలో జీవించడమే తప్ప, కృత్రిమమైన హొయలు పోవడం ఆమెకు అస్సలు తెలియదు. అందుకే ఆమె చేసే సినిమాలు ఎంత డిఫరెంట్‌గా ఉంటాయో, ఆమె ఇచ్చే స్టేట్‌మెంట్స్ కూడా అంతే పవర్‌ఫుల్‌గా ఉంటాయి. తాజాగా పెళ్లి, పిల్లల విషయంలో నిత్యా చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్‌లో వైరల్ అవుతున్నాయి. సాంప్రదాయాలకు, సామాజిక కట్టుబాట్లకు భిన్నంగా ఆమె వ్యక్తపరిచిన అభిప్రాయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. చైల్డ్ ఆర్టిస్ట్‌గానే వెండితెరకు పరిచయమై, తెలుగులోకి రాకముందే దాదాపు ఎనిమిది సినిమాల్లో నటించి మెప్పించింది ఈ మలయాళ ముద్దుగుమ్మ. అలా మొదలైంది సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, మొదటి చిత్రంతోనే కుర్రకారు గుండెల్లో గంటలు కొట్టేసింది. కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రల కంటే, నటనకు ప్రాధాన్యం ఉన్న క్యారెక్టర్ ఓరియెంటెడ్ రోల్స్‌నే ఎంచుకుంటూ స్లో అండ్ స్టడీగా దూసుకుపోతోంది. ఆమె స్క్రీన్ మీద ఉంటే ఆ కళే వేరు. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో నిత్యా మాట్లాడిన మాటలు వింటే.. ఆమె ఎంత బోల్డ్ అండ్ క్లారిటీ ఉన్న పర్సనో అర్థమవుతుంది. సినిమాలు తగ్గిన టైంలో సాధారణంగా హీరోయిన్లకు పెళ్లి ఎప్పుడు అనే ప్రశ్న ఎదురైతే ఏదో ఒక సమాధానం చెప్పి దాటవేస్తుంటారు. కానీ నిత్యా మాత్రం ఈ విషయాన్ని చాలా లోతుగా విశ్లేషించింది. పిల్లల్ని కనడానికి పెళ్లితో సంబంధం లేదని ఆమె అభిప్రాయ పడటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పిల్లలు కావాలనుకోవడం అనేది పూర్తిగా ఒక వ్యక్తిగత నిర్ణయమని, దానికి వివాహం ఒక్కటే మార్గం కాదని ఆమె కుండబద్దలు కొట్టారు. ఒక ప్రాణానికి జన్మనివ్వాలనే కోరికను సామాజిక హోదాతో లేదా పెళ్లి అనే ముడితో కలపాల్సిన అవసరం లేదని చెప్పడం ఆమె ధైర్యానికి నిదర్శనం. ప్రతి ఒక్కరూ గుర్తించేలా ఆమె తన వ్యక్తిగత స్వేచ్ఛ గురించి గళం విప్పింది. పెళ్లి గురించి మాట్లాడుతూ.. ప్రస్తుతం తనపై ఎలాంటి కుటుంబ ఒత్తిడి లేదని, సోలో లైఫ్‌ను తాను పూర్తిస్థాయిలో ఎంజాయ్ చేస్తున్నానని నిత్యా వెల్లడించింది. పెళ్లి అనేది జీవితంలో ఒక భాగం మాత్రమే అని, దానివల్ల కెరీర్ ముగిసిపోదని ఆమె నమ్ముతోంది. సమాజం ఏమనుకుంటుంది అనే దానికంటే, తన మనసుకి ఏది సరైనది అనిపిస్తుందో అదే చేస్తానని నిత్యా చెప్పిన మాటలు యువతలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రస్తుతం సినిమాలు అలాగే వెబ్ సిరీస్‌లతో ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ, తనకంటూ కొన్ని స్పష్టమైన హద్దులను గీసుకుని ముందుకు సాగుతోంది. నిత్యామీనన్ చేసిన ఈ వ్యాఖ్యలు కొంతమందికి వివాదాస్పదంగా అనిపించినా, మరికొంతమంది మాత్రం ఆమెలోని నిజాయితీని మెచ్చుకుంటున్నారు. ఏది ఏమైనా నిత్యా ఎప్పుడూ ట్రెండ్‌ను ఫాలో అవ్వదు.. ట్రెండ్‌ను సెట్ చేస్తుంది.

## హైకోర్టును ఆశ్రయించిన అషురెడ్డి



పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి, దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో నటి అషురెడ్డి పై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ వినకుండానే పోలీసులు ఏకపక్షంగా ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ ఎఫ్‌ఐఆర్ ను వెంటనే కొట్టివేయాలని కోర్టును కోరారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది.

Printer, Published and Owned by AMBATI PUBLICATIONS at H.No. 8-3-214, Mallikarjun Nagar, Godavarikhani, Dist. Peddapalli. Telangana State - 505 209."
Printers : Ganesh Offset Printers, Godavarikhani. Editor: P. Ramakrishna, RNI No. TELTEL/2021/02031, email : yadavpolaveni123456@gmail.com, Mobile : 7396644411